

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## వ్యక్తిగత దూషణలు మానుకోవాలి

**విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు**

ఏటూరునాగారం, మార్చి 18 : కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు మరిచి వ్యక్తిగత దూషణలకు దిగడం మానుకోవాలని బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, ఆత్మ మాజీ చైర్మన్ దుర్గం రమణయ్య, శివాలయం కమిటీ మాజీ చైర్మన్ తాడూరి రఘు హెచ్చరించారు. రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు ప్రభుత్వం వైఖరి, వాగ్దానాల అమలు, అవకతవకలు వంటి పలు అంశాలపై నిలదీస్తూ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. కాగా, దీనిపై కాంగ్రెస్ నాయకులు కూడా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి లక్ష్మీనర్సింహారావుపై ఆరోపణలు చేశారు. దీంతో తాము ప్రభుత్వం వైఖరిపై నిలదీస్తే కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిపై వివరణ ఇవ్వాల్సింది పక్కన బెట్టి వ్యక్తిగత దూషణలకు దిగారంటూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో మండల కేంద్రంలో చేసిన కోట్లాది రూపాయల పనులను మర్చిపోయారంటూ ప్రశ్నించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఆర్డీవో కార్యాలయం మంజూరు, ఫైర్ స్టేషన్ ఏర్పాటు, ఇతరత్రా అనేక రకాలుగా అభివృద్ధి చేశామన్నారు. ములుగులో బీఆర్ఎస్ గెలవకపోయినప్పటికీ మాట ప్రకారం జిల్లాను కేసీఆర్ ప్రకటించారన్నారు. గత 15నెలలుగా కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ఖాజాపాషా, మాదిరి రామయ్య, ఎండీ వలిబాబా, దన్నపునేని కిరణ్, దొడ్డ కృష్ణ, ఈసం రామ్మూర్తి, కుమ్మరి చంద్రబాబు, సప్పిడి రాంనర్సయ్య, జాడి భోజారావు, దేవులపల్లి సమ్మయ్య, కావేరి చిన్నికృష్ణ, గార ఆనంద్, కాళ్ల రామకృష్ణ, ఆతుకూరి రాంబాబు, బట్టు రమేశ్, చంద్రమొగిళి, నాగసాగర్, ఖలీల్, బాసాని శేఖర్, వావిలాల కిశోర్, రంజిత్, వంశీ, మోహన్, సతీశ్, నవీన్, రాంనర్సయ్య, సోదారి రమేశ్, జూపాక నవీన్, బూర వెంకన్న పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి : సీడీపీవో

ఏటూరునాగారం, మార్చి 18 : ఎయిడ్స్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సీడీపీవో ప్రేమలత కోరారు. స్థానిక డిగ్రీ కళాశాలలోఎయిడ్స్ నియంత్రణ సంస్థ, నెహ్రూ యువ కేంద్రం, ఎన్ఎస్ఎస్ యూనిట్, కస్తూరి బాయి మహిళా మండలి సౌజన్యంతో మంగళవారం లైంగిక వ్యాధులపై యువతకు అవగాహన కల్పించారు. సీడీపీవో మాట్లాడుతూ ఆధునిక సమాజంలో యువత విలువలతో కూడిన జీవితాన్ని సాగించాల్సిన అవసరం ఉందన్నారు. జీవితంలో స్థిర పడిన తర్వాతే వివాహం చేసుకోవాలన్నారు. వ్యాస రచన పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందచేశారు. అవగాహన సదస్సులో నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్, దిశ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జ్యోతి, రిసోర్సు పర్సన్ ఆకులపల్లి మధు, కొమురగిరి సామ్రాజ్యం, సీహెచ్ వెంకటయ్య, స్పోర్ట్సు ఆఫీసర్ శ్యామలత, అడ్వకేటు బానోత్ మహేందర్, జిల్లా బాలల ప్రొటెక్షన్ అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

## రాజలింగమూర్తి హత్య కేసులో హరిబాబు సహా ఇద్దరి అరెస్టు

భూపాలపల్లి రూరల్, మార్చి 18 : ఫిబ్రవరి 19న భూపాలపల్లి పట్టణంలో జరిగిన నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసులో ఏ-8గా ఉన్న కొత్త హరిబాబును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. రాజలింగమూర్తి హత్య కేసులో ప్రధాన నిందితుడైన కొత్త హరిబాబు పారిపోవడానికి సహకరించిన ములుగు జిల్లాకు చెందిన వట్టె రమణయ్య, రమను కూడా అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. హరిబాబు అరెస్ట్ నిమిత్తం మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఢిల్లీ, జైపూర్, ఆగ్రా తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే అరెస్టు అయిన నిందితులను మళ్లీ పోలీస్ కస్టడీకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారించి, తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సై సాంబమూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

వెంకటాపురం(నూగూరు), మార్చి18: మండలకేంద్రంలోని దుర్గమ్మ గుడి సెంటర్‌లో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాజా (58) దుర్గమ్మ గుడి సెంటర్ నుంచి నడుచుకుంటూ అంబేద్కర్ సెంటర్‌కు వెళ్తున్నాడు. ఈక్రమంలో జయశంకర్‌భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నవాబ్‌పేటకు చెందిన ఉదయ్ కిరణ్ (30) ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ రాజాను ఢీకొట్టాడు. బైక్ వేగం అదుపు కాక పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో రాజా, ఉదయ్ కిరణ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

# విద్యార్థులు కష్టపడి చదవాలి

- అర్హత ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు
- తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి
- కలెక్టర్ టీఎస్ దివాకర
- గ్రామాల్లో పర్యటన



అగ్నిపథ్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

ఏటూరునాగారం, మార్చి 18 : విద్యార్థులు ఇష్టంతో చదవి, భయాన్ని వీడాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వంట గదిని తనిఖీ చేశారు. వంట గదిలో పరిశుభ్రతను పాటించాలని సిబ్బందికి సూచించారు. భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతి రోజూ నాలుగు, ఐదు గంటలు తప్పకుండా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ముందుగా పరీక్షల సమయంలో భయాన్ని తొలగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం స్థానిక ఐటీఐలో అగ్నిపథ్2025-26 సంవత్సరంలో భారత సైన్యంలో చేరడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించగా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. భారత సైన్యంలో చేరడానికి ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. ఐటీఐ క్యాంపస్ ఆవరణలో నిర్మిస్తున్న భవనం పనులు పరిశీలించారు.

**అర్హత ఉన్న పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు..**

అర్హత ఉన్న పేద వారందరికీ మొదటి విడుతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మండలంలోని ముల్లకట్టలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి రూ.5లక్షలు ఇవ్వడం జరుగుతుందని, లబ్ధిదారులు పునాది పని పూర్తి చేయగానే బ్యాంకులో రూ. లక్ష జమ చేస్తామన్నారు. విడుతల వారీగా నిధులు విడుదల చేస్తామన్నారు. రామన్నగూడెంను సందర్శించి ఒక్కడ ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకును పరిశీలించారు. ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ మరమ్మతులు తక్షణమే చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారి రాంపతి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సతీశ్, డిప్యూటీ తహసీల్దార్ వర్మ, ఐటీఐ ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

**సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష**

ములుగురూరల్ : సంక్షేమ శాఖ అధికారులతో కలెక్టర్ టీఎస్ దివాకర అదనపు కలెక్టర్ మహేందర్‌జీతో కలిసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. విధులు నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు లేని సెంటర్లలో సూపర్‌వైజర్ పర్యవేక్షణలో సేవలు కొనసాగించాలని ఆదేశించారు. ప్రతి ప్రాజెక్టు నుంచి వచ్చిన రిపోర్టులను ఎప్పటికప్పుడు కలెక్టరేట్‌లో సమర్పించాలన్నారు. ఈ సమీక్షలో డీడబ్ల్యూవో శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

## లైంగికదాడి కేసులో పదిన్నరేండ్ల జైలు

భూపాలపల్లి రూరల్, మార్చి 18 : లైంగికదాడి కేసులో నిందితుడికి పదిన్నర సంవత్సరాల జైలు శిక్ష, రూ.15 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. 19 జనవరి 2019న అడవిముత్తారం మండలం మహబూబ్‌పల్లి గ్రామంలో వివాహిత మహిళ తన భర్త పనిమీద వరంగల్‌కు వెళ్లగా ఒంటరిగా ఇంట్లో నిద్రిస్తుండగా రాత్రి 10 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన అర్నేని నరేశ్ ఇంట్లోకి వెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆమె అరుపులు విని అత్తమామలు, మరిది రాగా, గమనించి నిందితుడు పారిపోయాడన్నారు. బాధితురాలి భర్త వచ్చిన తర్వాత జరిగిన విషయం చెప్పడంతో అడవిముత్తారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై వెంకటేశ్వర్‌రావు నిందితుడిపై లైంగికదాడి కేసు నమోదు చేయగా, అప్పటి కాటారం సీఐ ఎడ్ల మహేశ్ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తర్వాత సాక్ష్యాధారాలతో నిందితుడిపై చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎదులాపురం శ్రీనివాస్ వాదనలు వినిపించారు. కోర్టు లైజన్ ఆఫీసర్ గాండ్ల వెంకన్న ఏఎస్సై ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ కే రమేశ్, కే వినోద్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నారాయణబాబు నేరం రుజువైనందున నిందితుడికి పదిన్నరేండ్ల జైలు శిక్ష, రూ.15వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు. కేసులో నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన ప్రస్తుత కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, అడవిముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్‌ను, అప్పటి దర్యాప్తు అధికారులను ఎస్పీ అభినందించారు.

## వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

వెంకటాపురం(నూగూరు), మార్చి18 : పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలు రాసి 100శాతం ఉత్తీర్ణత సాధించాలని ఏటీడీవో క్షేత్రయ్య అన్నారు. మంగళశారం చిరుతపల్లి-2 బాలికల ఆశ్రమ పాశాలను సందర్శించారు. పాఠశాల రికారులు, హాజరు పట్టికలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. నీటి, విద్యుత్ సమస్యలు ఆయన దృష్టికి విద్యార్థులు తీసుకురాగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఏటీడీవో వెంట హెచ్ఎం నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

## వసతి గృహాన్ని సందర్శించిన డీపీఎంవో

వెంకటాపురం(నూగూరు), మార్చి 18 : మండలకేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని మంగళవారం డీపీఎంవో సత్యనారాయణ సందర్శించారు. పరిసరాలను, టాయిలెట్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మెనూ వివరాలు, వంటల నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వార్డెన్ సత్యనారాయణను ఆదేశించారు.

## గురుకుల పాఠశాలలో డీసీవో తనిఖీ

చిట్యాల, మార్చి 18 : మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మండల స్పెషల్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ మాలోత్ వాల్యా నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. గురుకులంలో ఉన్న రికార్డులు, డైనింగ్ హాల్, శానిటేషన్, కిచెన్, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో జయశ్రీ, ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కాటారం, మార్చి 18 : విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి, డీఆర్డీవో నరేశ్ అన్నారు. మేడిపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి తరగతి గదులు, వంట గది, డైనింగ్ హాల్, పారిశుధ్య పనులు, స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలుర పాఠశాలలను తహసీల్దార్ నాగరాజు పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, హెచ్ఎం శారద, జయలక్ష్మి, ఆర్ఐ వెంకన్న, కార్యదర్శి రాకేశ్ ఉన్నారు.

## విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

ములుగురూరల్, మార్చి 18 : ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నుంచి మంజూరైన కళ్లద్దాలను విద్యార్థులకు రాయినిగూడెం ఆశ్రమ పాఠశాలలో డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు అందించారు. అనంతరం వేసవికాలంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాఠశాలలోని తరగతి గదులను, వంట గదిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పత్తిపల్లి సబ్ సెంటర్‌ను సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట వైద్యులు శ్రీలత, మల్లికార్జున్, సిబ్బంది ఉపేంద్ర, తిరుతమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

మంగపేట, మార్చి 18 : కమలాపురం బిల్ట్ కార్మికుల వేతన సెటిల్‌మెంట్‌కు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పలువురు సీనియర్ కార్మికులు తహసీల్దార్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. వేతన సెటిల్‌మెంట్‌లో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ వ్యవహారంలో తమకు ప్రభుత్వపరమైన సహకారం అందేలా చూడాలని కోరతూ వినతిపత్రంలో తమ సమస్యలు ఏకరవు పెట్టారు.

## గుండెపోటుతో సీపీఎం నాయకుడు మృతి

గోవిందరావుపేట, మార్చి 18 : మండల సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు, వ్యవసాయ కార్మిక సంఘం నేత అంబాల పోశాలు సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జీ నాగయ్య, నాయకులు పోశాలు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు పోశాలు పార్టీకి చేసిన సేవలను కొనియాడారు.

## బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

చిట్యాల, మార్చి 18 : బైక్ అదుపుతప్పి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని లక్ష్మీపూర్ తండా వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పోతనవేన అజయ్ కుమార్ (24) పనుల నిమిత్తం చిట్యాల మండలం వైపు వచ్చినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఒడితల గ్రామ ప్రధాన రహదారి నుంచి భూపాలపల్లి మండలం మోరంచ వైపు బైక్‌పై వెళ్తుండగా లక్ష్మీపూర్ తండ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. స్థానికులు గమనించి 108 వాహనంలో భూపాలపల్లి వంద పడకల దవాఖానకు తరలించగా అప్పటికే అజయ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి వీరేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

కాటారం, మార్చి 18 : రేగులగూడెం గ్రామ పంచాయతీ పరిధి గోపాల్ పూర్ గ్రామానికి చెందిన జనగాం అశోక్ (30) మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. వ్యవసాయం చేసుకుంటూ జీవించే అశోక్‌కు మహాముత్తారం మండలం యామన్ పల్లికి చెందిన కొండగొర్ల వనిత ఆలియాస్ రజితతో వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. ఆరు నెలల క్రితం గర్భిణిగా ఉన్న సమయంలో రజిత అనారోగ్యం పాలవగా హనుమకొండలోని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో అశోక్ మూడేళ్ల కుమారుడిని అత్తమామలు యామనపల్లికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో వారు అశోక్‌తో గొడవకు పడేవారు. భార్య మృతి చెందడం, కొడుకు తన వద్ద లేడని, అత్తమామలు కట్నం డబ్బులు అడుగుతున్నారని మనస్తాపంతో సోమవారం గ్రామ సమీపంలోని వాగు వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

## వన్య ప్రాణులను కాపాడుకోవాలి



హనుమకొండ జూపార్కులో కొండగొర్రె పిల్లను అప్పగిస్తున్న అధికారులు

గోవిందరావుపేట, మార్చి 18 : వన్య ప్రాణులను కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పస్రా రేంజ్ అధికారి మాధవి సీతల్ అన్నారు. మండలంలోని చల్వాయి-బుస్సాపురం అటవీ ప్రాంతంలో మంటలు ఆర్పేందుకు వెళ్లిన క్రమంలో కాలుకు గాయమై పడి ఉన్న కొండగొర్రె పిల్లను స్థానిక బీట్ ఆఫీసర్ దీప్‌లాల్ చూసి దానిని పస్రా రేంజ్‌కు తీసుకువచ్చారు. చికిత్స చేసిన అనంతరం కొండ గొర్రె పిల్లను హనుమకొండలోని కాకతీయ పార్కుకు తరలించినట్లు మాధవిసీతల్ వివరించారు. ప్రస్తుతం అడవుల్లో చెట్లు ఎండిపోవడంతో వన్య ప్రాణులు గ్రామాల్లోకి వచ్చే వీలు ఉందని అన్నారు. గ్రామాల్లోకి వస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో వేణుగోపాల్, బీట్ ఆఫీసర్లు దీప్‌లాల్, అర్జున్, సిబ్బంది ఉన్నారు.

## పంట నమోదు ప్రక్రియను పరిశీలించిన డీఏవో

గణపురం, మార్చి 18 : మండలకేంద్రంలో పంట నమోదు ప్రక్రియ, పంట పొలాలను మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరునాయక్ పరిశీలించారు. అనంతరం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతు వేదికలో రైతులతో సమావేశమై మాట్లాడారు. వరి పంటపై అధిక యూరియా వాడుతున్నారని, దీనిని తగ్గించుకోవాలన్నారు. యూరియా అధికంగా వాడడం వల్ల చీడ పీడలు ఎక్కువగా ఆశిస్తాయని తెలిపారు. రైతులు తాము సాగు చేసే పంటల కోసం వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తప్పనిసరిగా పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. ఆయన వెంట ఏవో ఐలయ్య, సొసైటీ సీఈవో సురేశ్, భిక్షపతి, ఏఈవోలు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

తాడ్వాయి, మార్చి 18 : తాడ్వాయి మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సురేశ్‌బాబును మంగళవారం బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు దండుగుల మల్లయ్య ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. కలిసిన వారిలో తాడ్వాయి గ్రామకమిటీ అధ్యక్షుడు తుమ్మల రాజేందర్, నాయకులు రామసహాయం శ్రీనివాసరెడ్డి, నర్సింగరావు, నాగమ్మ, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొత్తూరి రోహిత్, విక్రమ్, నవీన్ ఉన్నారు.

## గోదావరి తీరంలో పారిశుధ్య పనులు

మహదేవపూర్ (కాళేశ్వరం), మార్చి 18 : కాళేశ్వరం గోదావరి పుష్కర ఘాట్ వద్ద పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత భక్తులు అక్కడే వదలివెళ్లిన ప్లాస్టిక్ కవర్లు, డబ్బాలు, పాత వస్తువులను జీపీ సిబ్బంది ట్రాక్టర్ ద్వారా తొలగించి శుభ్రం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలనే ప్రభుత్వ ఆదేశాలు అమలు కావడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోదావరి పరిసరాల్లో ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు వాడి ఎక్కడ పడితే అక్కడపడేయడంతో పారిశుధ్య నిర్వహణ భారం అవుతున్నది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కాళేశ్వరంలో ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

## బీమా చెక్కు అందజేత

టేకుమట్ల, మార్చి 18 : మండలంలోని రాఘవరెడ్డిపేట చలివాగులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన వెల్లంపల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ సిబ్బంది సొల్లేటి రాములు కుటుంబానికి రూ. 10 లక్షల ప్రమాద బీమా చెక్కును మంగళవారం పోస్టల్ డిపార్మెంట్ అధికారులు అందించారు. రాములు రూ.699తో పోస్టాఫీస్‌లో బజాజ్ గ్రూప్ ఆక్సిడెంట్ పాలసీని తీసుకున్నాడు. రెండు నెలలకే ప్రమాదంలో చనిపోగా బీమా చెక్కును రాములు కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ హనుమంతు, భూపాలపల్లి పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఇండియా పోస్ట్ పేమెంట్స్ హనంకొండ మేనేజర్ ప్రమోద్, లింగమూర్తి, నరేశ్, మెయిల్ ఓవర్సీర్ సురేశ్, నరేశ్, స్పెషల్ ఆఫీసర్ శైలజ, టేకుమట్ల ఎంపీడీవో అనిత, ఎంపీవో సురేశ్ పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్ దళిత వ్యతిరేక పార్టీ'

గణపురం, మార్చి 18 : కాంగ్రెస్ దళిత వ్యతిరేక పార్టీ అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో దళితులు అన్నిరకాలుగా నష్టపోయారన్నారు. అగ్ర కులస్తులకు పెద్దపీట వేసి, దళితులను సేవకులుగా చూసిన నీచమైన పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఆ పార్టీలో దళిత నాయకులకు సరైన గౌరవం లేదని, ఇప్పటి వరకు మాదిగలకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వకుండా అవమానించిందన్నారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఏకవచనంతో ఎక్కడా మాట్లాడలేదని, ఆయనను సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. వెంటనే సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## నిబంధనల ప్రకారం పనిచేయాలి

మల్హర్, మార్చి 18 : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి హామీ కూలీలు పని చేస్తే రోజుకు రూ.300 వస్తాయని డీఆర్వో నరేశ్ అన్నారు. మండలంలోని ఎడ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వాటర్ హర్వెస్టింగ్ కమ్యూనిటీ పాండ్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో కూలీలకు మంచి నీళ్లు, నీడకు పందిరి, మెడికల్ కిట్ ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన వెంట ఏపీవో హరీశ్, టెక్నికల్ అసిస్టెంట్స్ రమేశ్, శైలజ, శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేందర్ ఉన్నారు.

## కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



మాట్లాడుతున్న నాగయ్య

ములుగురూరల్, మార్చి18 : ములుగు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు మంగళవారం ధర్నా నిర్వహించారు. 48గంటల మహా ధర్నాలో భాగంగా రెండో రోజు వంటా వార్పు చేసిన అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి బడ్జెట్‌లో వేతనాలు పెంచి ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జీ నాగయ్య హాజరై వారికి మద్దతు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందించారు. నాగయ్య మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ నూతన జాతీయ విద్యావిధానాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయవద్దని, కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆ విధానాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ, రైతు సంఘం నాయకులు, దావూద్, సూడి కృష్ణారెడ్డి, సాంబశివ, గఫూర్‌పాషా, హుస్సేన్, రవి, బాలేశ్వర్, సమ్మక్క, పద్మారాణి, జమునా రాణి, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, సరిత, వనమా ల, పార్వతి, లక్ష్మీనర్సమ్మ, సుశాంతల, వెంకటరమణ, రత్నకుమారి, విజయలక్ష్మి, ఈశ్వరీ, భిక్షపతి, రుక్మిణి, నిర్మల, సుమలత పాల్గొన్నారు.

# అభ్యసన ఫలితాలు సాధించాలి

**ఎస్‌సీఈఆర్‌టీ ఫ్యాకల్టీ సభ్యుడు డాక్టర్ ఎస్ ఎం అహ్మద్**

ములుగురూరల్/వెంకటాపూర్, మార్చి 18 : విద్యార్థులు అభ్యసన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధమైన బోధన చేయాలని స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రిసర్చ్ ట్రైనింగ్(ఎస్‌సీఈఆర్‌టీ) ఫ్యాకల్టీ సభ్యుడు డాక్టర్ ఎస్ ఎం అహ్మద్ అన్నారు. మంగళవారం ఆయన మల్లంపల్లి, ములుగు, బండారుపల్లి, వెంకటాపూర్, జవహర్‌నగర్ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించి ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. పాఠ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు మల్లారెడ్డి, రమాదేవి, హాజినురాని, వెంకటాపూర్‌లో క్వాలిటీ కంట్రోల్ కోఆర్డినేటర్ కాటం మల్లారెడ్డి, హెచ్ఎం రాధిక, ఉపాధ్యాయులు జనగాం బాబురావు, వీ రవీందర్. షేక్ హసీన్ పాల్గొన్నారు.

**టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి**

గణపురం/ చిట్యాల, మార్చి 18 : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర విద్య పరిశోధన సంస్థ పర్యవేక్షకుడు రాంబాబు అన్నారు. మంగళవారం గణపురం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల, చిట్యాల మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా విద్య పర్యవేక్షణ అధికారి లక్ష్మణ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. విద్యార్థులలో అభ్యాసనాల సామర్థ్య పరీక్షలు ఫలితాలు, పదో తరగతి విద్యార్థుల ప్రగతి, ప్రీ ఫైనల్ ఫలితాలు, వారి అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు చేపట్టిన ప్రణాళికలపై సమీక్షించారు. వారి వెంట గణపురం, చిట్యాల ఎంఈవోలు ఊరుగొండ ఉప్పలయ్య, కొడపాక రఘుపతి, హెచ్ఎంలు ఇమ్మడిశెట్టి తిరుపతి, శ్రీరామ్ రఘుపతి ఉపాధ్యాయులు ఉన్నారు.

## కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి : డీఎంహెచ్‌వో

భూపాలపల్లి రూరల్, మార్చి 18 : కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో మధుసూదన్ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం కుష్టు వ్యాధి నిర్మూలనపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 17 నుంచి 30వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఇంటింటి సర్వేలో వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి సమీప పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వం రూ.12 వేలు ఇస్తున్నదని, వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే ఎండీటీ చికిత్స అందిస్తారన్నారు. వ్యాధి ఏ దశలో ఉన్నా సాధారణ వ్యాధి లాంటిదేనని ప్రజలు గమనించాలని, ఆందోళన చెందకుండా పీహెచ్‌సీలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవి రాథోడ్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, ఉమాదేవి, డెమో శ్రీదేవి, పారామెడికల్ ఆఫీసర్ మల్లయ్య, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

## దామెరకుంటలో అగ్ని ప్రమాదం

కాటారం, మార్చి 18 : మండలంలోని దామెరకుంట గ్రామంలో ఓ ఇంట్లో విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం జరిగి సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లింది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. దుర్గం గట్టుమల్లు, మల్లక్క దంపతులు మంగళవారం కూలీ పనుల నిమిత్తం బయటకు వెళ్లగా కుమార్తె మాత్రమే ఇంట్లో ఉంది. ఆమె ఇంటిని బయటకు వచ్చిన సమయంలో విద్యుదాఘాతంతో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ఇది గమనించి సమీపంలో ఉన్న వారికి సమాచారం అందించి వారి సాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఇంట్లో ఉన్న గ్యాస్ బండను బయకు తెచ్చారు. కానీ, ఒక్కసారిగా ఫ్రిడ్జ్ పేలి మంటలు ఇల్లంతా వ్యాపించాయి. ఫ్యాన్, తలుపులు, బియ్యం, బీరువా, బట్టలు, సామగ్రి, నగదుతో పాటు పలు పత్రాలు పూర్తిగా కాలిపోయాయి. ఘటనలో సుమారు రూ.5లక్షల నష్టం వాటిల్లిందని, తమను ఆదుకోవాలని గట్టుమల్లు, మల్లక్క దంపతులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

## మధుసూదన్‌కు డాక్టరేట్



మధుసూదన్

జయశంకర్ భూపాలపల్లి, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : సామాజిక సేవలో మురహరి మధుసూదన్ పనితీరును గుర్తించిన ఏసియా వేదిక్ ఇంటర్‌నేషనల్ కల్చర్ అండ్ రీసర్చ్ స్ఫూర్తి అకాడమీ (న్యూ ఢిల్లీ) సంస్థ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఏప్రిల్ 17న హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీలో మధుసూదన్‌కు అవార్డు ప్రదానం చేయనున్నారు. జంగేడుకు చెందినఆయన పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఒక వైపు ఉద్యోగం చేస్తూనే సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. 2023లో జాతీయ సేవారత్న అవార్డు సైతం అందుకున్నాడు. ప్రస్తుతం మురహరి సేవా ట్రస్టును కొనసాగిస్తూ ఆచార్య జయశంకర్ సేవా సమితి (అక్కన్నపేట) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సేవలందిస్తున్నారు.

## పిచ్చిమొక్కల తొలగింపు

వాజేడు, మార్చి 18 : మండలంలోని నాగారం గ్రామంలో పూర్వం నుంచి ఎంతో ప్రసిద్ధిగాంచిన శివాలయం 16యేళ్లుగా మూతపడి ఆదరణకు నోచుకోవడంలేదు. దీంతో ఆలయం చుట్టూ పిచ్చిమొక్కలు, చెట్లు ఏపుగా పెరిగాయి. గ్రామ యువకులు మంగళవారం చేయిచేయి కలిపి పిచ్చిమొక్కలను తొలగించి చెత్తను బయటకు తీసివేశారు. యువకులను గ్రామస్తులు అభినందించారు.

# ఎల్ఆర్ఎస్ అవకాశాన్ని వినియోగించుకోవాలి

**భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, మార్చి 18 : లే అవుట్ క్రమబద్ధీకరణ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియపై లే అవుట్స్ ఓనర్లు, లైసెన్స్ సర్వేయర్లు, డాక్యుమెంట్ రైటర్స్‌తో కలెక్టర్ అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ (లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం) అమలులో వేగం పెంచాలని, ఈ నెలాఖరు వరకు ఫీజు చెల్లింపులో ప్రభుత్వం 25 శాతం రాయితీ అవకాశం కల్పించిందని, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లే అవుట్‌లో 10 శాతం ప్లాట్లు రిజిస్టర్ అయి ఉంటే, మిగిలిన 90 శాతం ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ పథకంలో రెగ్యులరైజేషన్‌కు అవకాశం కల్పించారని, అలాంటి వారికి కూడా మార్చి 31 వరకు 25 శాతం రాయితీ పొందే అవకాశం ఉందన్నారు. ప్లాట్లు కొనుగోలు చేసి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ కలిగిన వారికి కూడా రాయితీ వర్తిస్తుందన్నారు. ఎల్ఆర్ఎస్ అమలులో వెసులుబాట్లు కల్పిస్తున్న నేపథ్యంలో నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగకుండా మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 26 ఆగస్టు 2020న ఎల్ఆర్ఎస్‌కు 8,312 ఇంటి ప్లాట్లు, 60 లే అవుట్స్‌కు దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటికే 4,909 మందికి క్రమబద్ధీకరణ సమాచారం అందినట్లు తెలిపారు. మిగిలిన దరఖాస్తులు రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు విచారణ చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా లే అవుట్స్ ఓనర్లు, లైసెన్స్ సర్వేయర్లు, డాక్యుమెంట్ రైటర్లు సిటిజన్ లాగిన్‌లో సాంకేతిక పరమైన ఇబ్బందులు వస్తున్నాయని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, సబ్ రిజిస్ట్రార్ రాము, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, టీపీవో సునీల్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★Wanted Female Marketing Executives for a Reputed Pvt. Ltd Company. Salary : 12,000/- to 20,000/-, Quli: Inter/Degree, Age: 24 to 30. Cont: 7660009009, 7036229903
NTW-332480

**డాక్యుమెంట్స్ పోయినది**

నేను, గుర్రం మమత W/o కీ॥శే॥ గుర్రం రమేష్, R/o ఇ.నెం. 1-5-935/5/3, సిటిజన్ కాలనీ, పాత అల్వాల్, సికింద్రాబాద్, హైదరాబాద్. మా యొక్క ఇ.నెం. 5-70/153, ప్లాట్ నెం. 153 పార్ట్, 150 చ.గ. గల ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం. 2471/2007 మరియు లింక్ డాక్యుమెంట్ నెం. 3024/1999 & 4693/2006 గలవి హన్మకొండ నుండి హైదరాబాద్‌కు పోయే క్రమంలో పోయినవి. దొరికినవారు దయచేసి పై అడ్రస్ నందు అందజేయగలరు.

**CHANGE OF NAME**

★I, BURUGUGADDA JYOTHI W/o BURUGUGADDA UPENDER, R/o H-NO. 1-7-1550, Srinivas Nagar Colony, Balasamudram, Hanamkonda, Hanumakonda Dist - 506001, T.G, have Changed my name from BOORAGADDA JYOTHI W/o BOORAGADDA UPENDAR TO BURUGUGADDA JYOTHI W/o BURUGUGADDA UPENDER. for all purposes
NTW-000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565